క్లుప్తంగా

చదువుతో జీవితాలు మార్చుకోవచ్చు

ఉండి: ఎంతటి పేదరికంలో ఉన్నా చదువుతో జీవితాలను మార్చుకోగలమని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పెన్మెత్స రంగప్రసాదరాజు అన్నారు. శుక్రవారం కోలమూరు జెడ్పీ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 2024–25 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కాలు, నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, హెచ్ఎం విజయభాస్కర్, ముదునూరి శివరామరాజు, సత్తి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీపీగా పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు



కాళ్ల ఎంపీపీ శిరీషకు అవార్డు ఇస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ

కాళ్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్తమ ఎంపీపీగా కాళ్ల మండలం ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు అవార్డు అందుకున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ చేతులమీదుగా ఆమె ప్రసంశాపత్రాన్ని అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి విద్యుత్ ఉప కేంద్రం వద్ద మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కుప్పనపూడి, అయిభీమవరం, తాళ్లకోడు ఫీడర్ లైన్లలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కమ్మిలి రాంబాబు ఉండి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగారాంబాబుని మండలానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

బస్సు షెల్టర్, మహిళల ఉచిత బస్సు ప్రారంభం

ఆకివీడు: మండలంలోని జాతీయ రహదారికి చేర్చి దుంపగడప గ్రామంలోని అడ్డరోడ్డు వద్ద నిర్మించిన బస్ షెల్టర్‌ను శుక్రవారం ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. అనంతరం స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సుప్రయాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, మోటుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సంఘం భవనానికి శంకుస్థాపన

భీమవరం: భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మ దేవస్థానం పక్కన రెవెన్యూ అధికారుల సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమైన రెవెన్యూ శాఖ సంఘం ఆధ్వర్యంలో సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కెనాడి, నర్సాపురం డివిజన్ అధ్యక్షుడు కె సత్తిబాబు, వీఆర్వోలు రత్నరాజు, ముత్యాలు, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి శ్రావణమాస శుక్రవారం సందర్భంగా 50 వేల గాజులతో విశేష అలంకరణ చేశారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. భక్తులు దాతల సహకారంతో సుమారు 50 వేల గాజులతో అమ్మవారికి ఆలయ ప్రాంగణంకు అలంకరణ చేశారు. ఆదివారం భక్తులకు ఈ గాజులను పంపిణీ చేస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



భీమవరం: వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం అర్బన్: ఎంపీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం: డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందుజేస్తున్న దృశ్యం



భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గౌరవ వందనం చేస్తున్న దృశ్యం



భీమవరం(ప్రకాశం చౌక్): క్విట్ ఇండియా స్థూపం వద్ద స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్న ప్రముఖులు



వీరవారం: స్వాతంత్ర్య వేడుకల నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచంలోనే గొప్ప దేశం భారతదేశమని, ఈ దేశంలో జన్మించడం మనందరికి గర్వకారణమని భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాయలం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి వెంకటరాయుడు జాతీయజెండా ఆవిష్కరించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల కృషి వల్లనే నేడు మనమందరం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, జిల్లా అధికారప్రతినిధి కామన నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, యూత్‌వింగ్ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పార్టీ నాయకులు కోడే యుగంధర్, గంటా సుందరకుమార్, మానకొండ ప్రదీప్, నాగరాజు శ్రీనివాసరాజు, పాలివెల్లి మంగ, డీవీడీ ప్రసాద్, పాలా నాగరాజు, వీరవెల్లి ప్రవీణ్ కుమార్, పంజా సురేష్, షేక్ రబ్బాని, గుంటి ప్రభు, పెచ్చెట్టి ప్రసాద్, గోపిశెట్టి సుబ్బారావు, గంటా రాహుల్, మునగాల నర్సింహామూర్తి, కడలి శ్రీరాములు, బేతాళ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

భీమవరం: పట్టణంలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు శుక్రవారం వివిధ విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఎన్నార్ కళాశాలలో అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు జాతీయపతాకావిష్కరణ చేసి ఎన్‌సీసీ కెడెట్ల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంపీ పాక వెంకటసత్యనారాయణ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపల్ జి మోజెస్ తదితరులు పాల్గొన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం వద్ద స్వాతంత్ర్య వేడుకల్లో ఛాంబర్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కటికల పల్లారావు, పాకలపాటి సీతారామరాజు, పీఆర్వో కొప్పినీడి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మారుతీనగర్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వలవల నర్సింహారావు, పి రామ్మోహనరావు, కామన నాగేశ్వరరావు పాల్గొన్నారు. సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సర్వోదయ నాయకుడు సీహెచ్‌వీపీ మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు నివాళులర్పించారు. విష్ణు స్కూల్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపల్ ఎల్ బిందు జాతీయజెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్, బి వాసుదేవరావు, ఎం రామాంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయజెండాను పార్టీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, వీరవల్లి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ఆదిత్య స్కూల్లో విద్యాసంస్థల డైరెక్టర్ ఎం శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రిన్సిపల్ ఎ అనురాధ, వైస్ ప్రిన్సిప్ బి మావుళ్లు, బ్రహ్మం, జయకుమార్ పాల్గొన్నారు. సీఎస్ఎన్ కళాశాలలో సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలు స్మరించుకుందాం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వాతంత్ర్య పోరాటంలో సమరయోధులా చేసిన త్యాగాలు నేటితరం గుర్తుచేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలో భాగంగా అమరవీరులకు నివాళలర్పించి, ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రంగరాజు, సీతారామరాజులు అసోసియేషన్ సభ్యులు అరవ భాస్కరరావు, ఎస్ సత్యనారాయణ రాజు, పునః నిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సిహెచ్ వీరభద్రరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు..

హౌసింగ్ బోర్డు కాలనీలో

భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద హౌసింగ్ బోర్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి జనపాటి మధుసుధన్‌రావు, చెరుకువాడ రంగసాయి, రాంప్రసాద్, కుక్కల బాల, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం అర్బన్: ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ పోరాట నాయకులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాంత్రేగుల నరసింహరావు, ఎంపీడీవో మురళీగంగాధర్, ఏవో రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మద్దాల అప్పారావు, గుబ్బల శ్రీనివాసు, వీరవల్లి రాధాకృష్ణ, వీరవల్లి కోటేశ్వరరావు, పాల నాగరాజు, గూడూరి కొండ, మోగంటి నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంబరాన్నంటిన స్వాతంత్ర్య సంబరాలు



ఆకివీడు: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ కలారి జయలక్ష్మి



కాళ్ల: మండల పరిషత్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు



ఉండి: జాతీయపతాకానికి వందనం చేస్తున్న ఎంపీపీ ఇందుకూరి



పాలకోడేరు: ఎంపీపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు

ఆకివీడు: గ్రామాల్లో స్వాతంత్ర్య సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలోని చినకాపవరం గ్రామంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) జెండా ఎగురవేసి కేకును కట్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కళారి జయలక్ష్మి, వ్యవసాయశాఖ వద్ద ఏడీఏ కే.జీవన్ ప్రతాప్, వైఎస్సార్ సెంటర్‌లో ఆటోవాలా ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు కనుమూరు అబ్బాయిరాజు, స్థానిక ముస్లిం కాంప్లెక్స్, సాలిపేటలోని గాంధీ విగ్రహం వద్ద, అంబేద్కర్ విగ్రహం, ఏఎంసీ, రూరల్ బ్యాంక్, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, రూరల్ స్టేషన్, ఎక్సైజ్ ఆఫీసు వద్ద జెండా ఆవిష్కరించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద స్వాతంత్ర దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

కాళ్లలో..

కాళ్ల: భారతదేశ స్వాతంత్ర్య వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన వేడుకల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఏట నాగేశ్వరరావు, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కాళ్ల, కాళ్ళకూరు కలవపూడి, కోపల్లె సొసైటీలో సొసైటీలలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు జాతీయ జెండా ఆవిష్కరించారు. కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుందర్ సింగ్, పెదఅమిరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోమటిగుంటలో సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్, కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈఓ ఎం.అరుణ్ కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు.

ఉండిలో..

ఉండి: ఎందరో మహనీయుల త్యాగఫలం మన దేశ స్వాతంత్ర్యమని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గమహంకాళి అన్నారు. దేశ 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాలు, చర్చిల వద్ద, స్కూల్స్, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద పలు శాఖల కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉండి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో జమ్మూకాశ్మీర్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న ఆదాడ పవన్‌కుమార్‌ను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) జాతీయ జెండాని ఎగరవేశారు. అలాగే మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై మంతెన రవి వర్మ, గ్రామ సచివాలయ వద్ద ఆయా గ్రామాల సర్పంచులు, మండలంలోని పాఠశాల వద్ద పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లు జాతీయ జెండాను ఎగరవేశారు. ఆయా పాఠశాలల వద్ద వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అలాగే కొండేపూడి, వేంద్ర గ్రామాల్లో పాఠశాల,ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొండేపూడి సర్పంచ్ చింతపల్లి వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ బొక్క రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



దొంగపిండిలో హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: దాతలు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉషోదయ హాస్పటల్ ఎండీ డాక్టర్ నాగిడి హరిశ్చంద్రప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగిడి హరిశ్చంద్రప్రసాద్ ఆర్థిక సహకారంతో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నాగిడి లక్ష్మీ ప్రసన్న (ప్రథమ స్థానం)కు రూ. 10 వేలు, గాడి చిన్నారి (ద్వితీయ స్థానం) రూ. 5 వేలు, గాడి లక్ష్మణ్ (తృతీయ స్థానం) రూ. 3 వేలు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని సమాజ సేవకు కేటాయించాలన్నారు. విద్యార్థులు గ్రూప్–1, 2, ఇంజనీరింగ్, డాక్టర్స్ తదితర ఉన్నత చదువులను లక్ష్యంగా చేసుకుని కష్టపడి ఇష్టంతో చదవాలని సూచించారు. మన గ్రామంలో ఎంతో కష్టపడి జాతీయ స్థాయిలో ఐఏఎస్‌లో 62 స్థానం సాధించిన తిరుమాని పూజితను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతీ మోహన్ వైస్ ఎంపీపీ తిరుమాని ధనంజయ రాజు, ప్రధానోపాధ్యాయులు వీరభద్రుడు, మాజీ సర్పంచ్ నాగిడి ముత్యాలరావు, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ రేవు రామదాసు, రేవు వెంకన్న,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వత్రాలు



హౌసింగ్ బోర్డు కాలనీలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా 108 మంది మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రత సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 108 మంది మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రత సహస్ర కుంకుమార్చన పూజలను నిర్వహించారు. పూజలో పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ రవికులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, కుక్కల మధు, కడలి ఫణి కుమార్, పద్మావతి మహిళా పారాయణం బృందం, మహిళా భక్తులు పాల్గొన్నారు.